# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 122 క్రిష్ణా, మంగళవారం 27 - 01 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.



సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు


98497 07349


## దేవుడు పెట్టే పరీక్షలను జయించే శక్తిని కూడా ఇస్తాడని ఉద్బోధ



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 25,** మంగళగిరి నియోజకవర్గాన్ని దేశంలోనే ఒక ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుకోవచ్చని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. సోమవారం నాడు మంగళగిరి పట్టణంలోని ఆత్మకూరులో ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన క్రీస్తు కరుణాలయం ప్రతిష్టా మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రిబ్బన్ కట్ చేసి నూతన చర్చిని ప్రారంభించడంతో పాటు, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం చర్చి ప్రాంగణంలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ దవుడు మనకు పరీక్షలు పెడతాడు. కానీ, ఆ పరీక్షలను జయించే శక్తిని కూడా ఆయనే మనకు ప్రసాదిస్తాడు. ఎవరూ ఊహించని విధంగా ఈ మందిరాన్ని పునర్నిర్మించుకోవడం గొప్ప విషయం. కష్టాల్లో ఉన్న మన తోటివారిని ఆదుకోవడం, వారికి అండగా నిలవడం మనందరి బాధ్యత" అని ఉద్బోధించారు. ఏడాదిలోపే చర్చి నిర్మాణాన్ని పూర్తి చేయాలన్న సంకల్పం నెరవేరిందని, పట్టుదలతో పనిచేసిన పునర్నిర్మాణ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. చేయి చేయి కలిపితే ఏదైనా సాధించవచ్చనడానికి ఈ నిర్మాణమే ఒక ఉదాహరణ అని కొనియాడారు. ఈ మందిర నిర్మాణంలో పాలుపంచుకునే అవకాశం దేవుడు తనకు కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.ఈ రోజుల్లో చిన్న చిన్న విషయాలకే యువత, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇది చాలా బాధాకరం. దేవుడు పెట్టే పరీక్షలను సంకల్ప బలంతో జయించాలి అని ఆయన హితవు పలికారు. తన రాజకీయ జీవితాన్ని ఉదాహరణగా చూపుతూ 2019లో మంగళగిరిలో పోటీ చేసి ఓటమి పాలయ్యాను. అయినా నేను భయపడలేదు. మరింత కసితో పనిచేసి ప్రజలకు దగ్గరయ్యాను. ఓటమిని ఒక పరీక్షగా స్వీకరించి ముందుకు సాగానుఅని గుర్తుచేశారు. కులాలు, మతాలు వేరైనా అందరం కలిసికట్టుగా ముందుకు సాగుతూ కష్టాలను ఎదుర్కొందామని, దేవుడి ఆశీస్సులతో మంగళగిరిని అభివృద్ధి చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, ఏపీఐఐసీ డైరెక్టర్ కనికళ్ల చిరంజీవి, ఏఈఎల్సీ అడ్మినిస్ట్రేటర్ పి.యస్ జోసఫ్, రైట్.రెవరెండ్ డాక్టర్ ఎస్.జే బాబూరావు, రెవరెండ్ డాక్టర్ కొడాలి విజయ్, రెవరెండ్ జే.ఏసురత్నం, సంఘ పెద్దలు, పాస్టర్లు, క్రైస్తవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి అందరితో కలిసి ఫోటోలు దిగారు.

## కేంద్రం ప్రకటించిన పద్మశ్రీ పురస్కారంపై నటుడు రాజేంద్ర ప్రసాద్ హర్షం



నటుడు నటకిరీటి రాజేంద్ర ప్రసాద్?కు కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారాన్ని ప్రకటించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తన జీవితంలో ఈ రోజును ఎప్పటికీ మర్చిపోలేనని అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ గౌరవం కేవలం తనకు మాత్రమే కాదని తెలుగు హాస్యానికి వినోదాన్ని ఆస్వాదించే సామాన్య ప్రేక్షకుడికి దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. కళలను గౌరవించి తనను ఈ పురస్కారానికి ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వానికి, జ్యూరీ సభ్యులకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.గత 48 ఏళ్లుగా ప్రేక్షకులు అందిస్తున్న ప్రేమే ఈ స్థాయి గుర్తింపునకు కారణమని ఆయన అన్నారు.నాలాంటి నటుడిని మీ ఇంటి మనిషిలా ఆదరించి నటకిరీటి'ని చేసి ఈ స్థాయికి తీసుకువచ్చింది మీ చప్పట్లే. ఆ రుణం నేను ఎప్పటికీ తీర్చుకోలేను అని రాజేంద్ర ప్రసాద్ భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. తనను ఎప్పుడూ నవ్విస్తూ ఉండమని దీవించిన ప్రేక్షక దేవుళ్లకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

## ఏపీ సీఎం బిజీ షెడ్యూల్: క్యాబినెట్ భేటీ నుంచి కుప్పం పర్యటన వరకు..



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 26,** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేపు (మంగళవారం) సాయంత్రం 4 గంటలకు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్లనున్నారు. అక్కడ పార్టీకి చెందిన ముఖ్య నేతలు మరియు సీనియర్ ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా భేటీ కానున్నారు. రాబోయే రాజకీయ పరిణామాలు, పార్టీ సంస్థాగత బలోపేతం మరియు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ప్రభుత్వ పాలనలో భాగంగా ఈ నెల 28వ తేదీన వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో సీఎం అధ్యక్షతన కీలకమైన క్యాబినెట్ సమావేశం జరగనుంది. ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులకు ఆమోదం తెలపడంతో పాటు, సామాజిక పింఛన్లు మరియు కొత్త పథకాల అమలుపై మంత్రివర్గం చర్చించనుంది. పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా ఈ సమావేశంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి.

క్యాబినెట్ సమావేశం ముగిసిన మరుసటి రోజు, అంటే 29వ తేదీన ముఖ్యమంత్రి అరకు ప్రాంతంలో పర్యటించనున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని పరిస్థితులను స్వయంగా పరిశీలించడంతో పాటు, అక్కడ అమలవుతున్న గిరిజన సంక్షేమ పథకాలను ఆయన సమీక్షించనున్నారు. స్థానిక ప్రజలతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం మరియు పర్యాటక రంగ అభివృద్ధిపై అధికారులకు దిశానిర్దేశం చేయడం ఈ పర్యటన యొక్క ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. పర్యటనల ముగింపులో భాగంగా 30 మరియు 31వ తేదీల్లో ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో పర్యటించనున్నారు. రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో భాగంగా నియోజకవర్గంలో పెండింగ్?లో ఉన్న పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించడమే కాకుండా, కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. స్థానిక నాయకులు మరియు కార్యకర్తలతో భేటీ అయ్యి నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

## 2026ను టెక్నాలజీ డ్రివెన్ డిసిషన్ మేకింగ్ ఇయర్గా మార్చాలని పిలుపు



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 26,** ప్రభుత్వ సేవల్లో కృత్రిమ మేధ వినియోగం పెంచాలని పాలనలో సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించి, క్షేత్రస్థాయి ఉద్యోగులపై పని భారాన్ని తగ్గించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. డేటా ఆధారిత పాలనపై మరింత దృష్టి సారిస్తామని, 2026వ సంవత్సరాన్ని 'టెక్నాలజీ డ్రివెన్ డిసిషన్ మేకింగ్ ఇయర్'గా మార్చాలని ఆయన ఆకాంక్షించారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ఆర్టీజీఎస్?పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.చంద్రబాబు మాట్లాడుతూ సామర్థ్యం లేని ఉద్యోగులకు సరైన శిక్షణ ఇచ్చి, వారి పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వ పాలనలో ఎదురయ్యే అనేక సమస్యలను టెక్నాలజీతో సులభంగా పరిష్కరించవచ్చని అన్నారు. ముఖ్యంగా, ప్రభుత్వ సేవల్లో కృత్రిమ మేధ వినియోగాన్ని పెంచాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఏఐ ద్వారా వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు.'మన మిత్ర' – వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 878 రకాల ప్రభుత్వ సేవలను అందిస్తున్నామని, ఇప్పటివరకు 1.43 కోట్ల మంది ఈ సేవలను వినియోగించుకున్నారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం వైద్యం, వ్యవసాయం, రెవెన్యూ, రహదారులు, ఆర్టీఏ, అగ్నిమాపక శాఖల పనితీరుపై కూడా సీఎం సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

## కర్నూలు లేడీ డాక్టర్ కేసు: హెచ్ ఐవీ ఇంజెక్షన్ ఇచ్చినా ప్రాణాపాయం లేనట్టేనా? నిపుణులు ఏం చెబుతున్నారు?



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 26,** కర్నూలులో సంచలనం సృష్టించిన లేడీ డాక్టర్ హత్యాయత్నం కేసులో ఊహించని మలుపు చోటుచేసుకుంది. తనను కాదని వేరే మహిళను వివాహం చేసుకున్న ప్రియుడిని దక్కించుకోవాలనే ఉద్దేశంతో, వసుంధర అనే వైద్యురాలు తన ప్రియుడి భార్యకు హెచ్?ఐవీ (౧×౧) ఇంజెక్షన్ ఇప్పించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ఘటనపై తాజాగా స్పందించిన వైద్య నిపుణులు బాధితురాలికి వైరస్ సోకే అవకాశం తక్కువని ప్రాథమికంగా నిర్ధారించారు. సైకోలా వ్యవహరించిన వసుంధర పక్కా ప్లాన్?తోనే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసుల విచారణలో తేలింది.

వైద్య నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిందితురాలు గత నెల 28వ తేదీనే ఒక రోగి నుంచి హెచ్?ఐవీ రక్తాన్ని సేకరించి ఫ్రిజ్?లో దాచిపెట్టింది. సాధారణంగా మానవ శరీరం వెలుపల, ముఖ్యంగా గడ్డకట్టిన లేదా పాతబడిన రక్తంలో హెచ్?ఐవీ వైరస్ ఎక్కువ రోజులు సజీవంగా ఉండదు. దాదాపు పది రోజులకు పైగా ఆ రక్తాన్ని నిల్వ చేయడం వల్ల అందులోని వైరస్ తీవ్రత క్షీణించి ఉంటుందని, కాబట్టి బాధితురాలికి నేరుగా వైరస్ సోకే ముప్పు లేదని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ఇది బాధితురాలి కుటుంబ సభ్యులకు కొంత ఉపశమనం కలిగించే వార్త అని చెప్పవచ్చు.అయినప్పటికీ, ఈ వ్యవహారంలో పూర్తిగా ప్రమాదం తప్పిందని చెప్పలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేవలం హెచ్?ఐవీ మాత్రమే కాకుండా, వేరొకరి రక్తాన్ని శరీరంలోకి ఎక్కించడం వల్ల రక్త వర్గాల మధ్య తేడాలు వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల బాధితురాలికి ఇతర ఆరోగ్య సమస్యలు లేదా అలర్జీలు తలెత్తే ప్రమాదం ఉందని, అందుకే ఆమెను నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అప్రమత్తత అవసరమని, అవసరమైన అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నామని వైద్య బృందం వెల్లడించింది.ఈ కేసులో నిందితురాలు వసుంధర కేవలం ఇంజెక్షన్ ఇవ్వడమే కాకుండా, అంతకుముందు బాధితురాలిని అంతం చేసేందుకు రోడ్డు ప్రమాదం కూడా చేయించిందని పోలీసులు గుర్తించారు. వృత్తిరీత్యా ప్రాణాలు కాపాడాల్సిన డాక్టర్, ప్రేమ ఉన్మాదంతో తోటి డాక్టర్?పైనే ఇలాంటి ఘాతుకానికి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. ప్రస్తుతం పోలీసులు ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. నిందితురాలికి సహకరించిన నర్సును, ఇతర వ్యక్తులను కూడా విచారించి కఠిన చర్యలు తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.

## రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి నేతలు కృషి చెయ్యాలి

**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 26,** రాష్ట్రాభివృద్ధిలో పార్లమెంట్ సభ్యుల భాగస్వామ్యం అత్యంత కీలకమని, కేంద్రం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు, ప్రాజెక్టులు సాధించడం ద్వారా రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీపీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై గట్టిగా గళం విప్పాలని, తమ నియోజకవర్గాల అభివృద్ధి అవకాశాలు, సమస్యల పరిష్కారాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ (టీడీపీపీ) సమావేశం జరిగింది. జనవరి 28 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, కేంద్రంతో జరపాల్సిన సంప్రదింపులపై ఎంపీలకు చంద్రబాబు స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ లోక్?సభ, రాజ్యసభ సభ్యులతో పాటు మంత్రి నారా లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# గ్రూప్-2'పై నత్తనడ!

రెండేళ్లు దాటినా పూర్తికాని నోటిఫికేషన్
మెయిన్స్ పరీక్ష జరిగి దాదాపు ఏడాది
అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినా తుది ఫలితాల వెల్లడికి కలగని మోక్షం
న్యాయ వివాదాలతో ఇంతకాలం ఆలస్యం
హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా ముందుకెళ్లని ఏపీపీఎస్సీ
ఈలోగా మళ్లీ పుట్టుకొస్తున్న కొత్త కేసులు
అభ్యర్థుల్లో పెరుగుతున్న ఆందోళన, ఆవేదన
'రోస్టర్' కేసు పెండింగ్‌తో ఆగిన గ్రూపు-1 ఫలితాలూ..



**క్రైం కౌంటర్ న్యూస్,**అమరావతి, జనవరి 26 రెండేళ్ల క్రితం 2023 డిసెంబరు 7న జారీ అయిన గ్రూప్-2 నోటిఫికేషన్ ప్రక్రియ నేటికీ నత్తనడకన సాగుతోంది. ప్రిలిమ్స్, మెయిన్స్, సర్టిఫికెట్ల పరిశీలన వంటి కీలక దశలు పూర్తి చేసుకున్నప్పటికీ.. తుది ఫలితాల వెల్లడికి మోక్షం కలగడం లేదు. ఉద్యోగార్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. 2023కు ముందు 2018లో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదలైంది. అంటే ఇప్పటివరకు ఏడేళ్ల కాలంలో రెండో నోటిఫికేషన్లు మాత్రమే వచ్చాయి. తరచూ నోటిఫికేషన్లు లేకపోవడంతో 2023 చివర్లో భారీ సంఖ్యలో 905 పోస్టులతో నోటిఫికేషన్ విడుదలైంది.వైసీపీ ప్రభుత్వంలో ఏపీపీఎస్సీ ఇచ్చిన ఏకైక గ్రూప్-2 నోటిఫికేషన్ ఇదే. 2024 ఫిబ్రవరి 25న ప్రిలిమ్స్ పరీక్షలు జరిగాయి. ఆ తర్వాత ఏడాదికి 2025 ఫిబ్రవరి 23న మెయిన్స్ జరిగాయి. 4.04 లక్షల మంది ప్రిలిమ్స్ రాయగా.. మెయిన్స్‌కు 92,250 మంది ఎంపికయ్యారు. వారిలో సర్టిఫికెట్ల పరిశీలనకు 2,559 మంది అర్హత సాధించారు. ఆ ప్రక్రియ కూడా పూర్తవగా.. కోర్టు కేసులు, ఇతర కారణాలతో తుది ఫలితాలు మాత్రం విడుదల కావట్లేదు.

ఇవీ వివాదాలు

రాష్ట్ర ప్రభుత్వం అంతకుముందున్న రోస్టర్ విధానం స్థానంలో కొత్తగా హారిజంటల్ రోస్టర్ విధానం ప్రవేశపెట్టింది. మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికులు, క్రీడా కోటా అభ్యర్థులకు ఈ విధానంతో సమాన అవకాశాలు లభిస్తాయి. అయితే గత విధానం తరహాలో ఏ పోస్టు ఎవరికి వస్తుందనేది హారిజంటల్ రిజర్వేషన్‌లో కచ్చితంగా అంచనా వేయలేరు. కాగా, అసలు ఈ రోస్టర్‌లోనే తప్పులున్నాయంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లారు. దానిపై చాలాకాలం విచారణ అనంతరం గత డిసెంబరు 30న హైకోర్టు ఆ పిటిషన్లను కొట్టివేసింది. కాగా, మరో ముగ్గురు క్రీడా కోటా అభ్యర్థులు క్రీడా కోటా అంశంపై హైకోర్టును ఆశ్రయించారు. అప్పటికే చాలాకాలం అయినందున క్రీడా కోటాలో ఇద్దరు అభ్యర్థులకు రెండు పోస్టులు రిజర్వ్ చేసి, ఫలితాలపై ముందుకెళ్లాలని న్యాయస్థానం ఆదేశించింది. కొట్టేసిన రోస్టర్ వివాదంలో ఇప్పుడు మరో పిటిషన్ హైకోర్టులో దాఖలైంది. దానిని న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. దీనిపై వాదనలు మొదలైతే.. తుది తీర్పు వెల్లడికి ఎంతకాలం పడుతుందో తెలియని పరిస్థితి. ఇలా కేసులు నమోదవుతూ, ఫలితాలు ఆగిపోతూ ఉంటే తామేం చేయాలని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయంటూ..

హైకోర్టు స్పష్టతనిచ్చినా ఏపీపీఎస్సీ ఫలితాల వెల్లడిపై నిర్ణయం తీసుకోలేకపోతోంది. మొత్తం 905 పోస్టుల్లో క్రీడా కోటా కింద 21 పోస్టులున్నాయి. వాటిలో రెండు పోస్టులు రిజర్వ్ చేయాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. హారిజంటల్ రిజర్వేషన్ విధానంలో ఆ రెండు పోస్టులు ఎక్కడ వస్తాయో చెప్పలేమని, ఆ రెండు పోస్టులను పక్కనపెట్టి ముందుకెళ్తే, తుది ఫలితాల అనంతరం మళ్లీ వివాదాలు తలెత్తుతాయని ఏపీపీఎస్సీ అభిప్రాయపడుతోంది. అప్పుడు మళ్లీ మొదటి నుంచీ తిరిగి పోస్టింగులు మార్చాల్సి వస్తుందని భావిస్తోంది. కాగా, గ్రూప్-1 ఫలితాల కోసమే గ్రూప్-2 ఫలితాలను ఆపేశారని అభ్యర్థులు సందేహిస్తున్నారు. ఎందుకంటే గ్రూప్-1 ఫలితాలపైనా రోస్టర్ కేసు పెండింగ్‌లో ఉండటంతో ఫలితాలు ఆగిపోయాయి. గ్రూప్-1, 2 నోటిఫికేషన్లలో తుది ఫలితాలకు ఎంపికైన అభ్యర్థులు సుమారు 20 మంది రెండింట్లోనూ ఉన్నారు. దీంతో ముందు గ్రూప్-2 ఫలితాలు ఇస్తే... వారిలో కొందరు తర్వాత ఇచ్చే గ్రూప్-1లోనూ ఎంపికైతే గ్రూప్-2 ఉద్యోగాలు వదిలేసి వెళ్లిపోతారు. ఆ పోస్టులు తర్వాత నోటిఫికేషన్లకు క్యారీ ఫార్వార్డ్ అవుతాయి. ఇలా కాకూడదనే ఉద్దేశంతోనే ఫలితాలను ఆపేస్తున్నారని, 10-20 మంది కోసం వేలాది మందిని ఆందోళనకు గురిచేస్తున్నారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

అభ్యర్థుల్లో పలు అనుమానాలు

పలు కారణాలతో గ్రూప్-2 ఫలితాలు ఆగిపోగా.. అభ్యర్థులు మాత్రం అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. న్యాయ వివాదాలు పరిష్కారమై ఫలితాలు ఇచ్చే పరిస్థితి ఉన్నా, ఆ సమయంలో ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నారు. కొన్ని పోస్టుల్లో కావాల్సిన వారి కోసం ఫలితాలు ఆపుతున్నారంటూ ప్రచారం మొదలైంది. ఈ అంశంపై అధికార పార్టీలోనూ అసంతృప్తి కనిపిస్తోంది. హైకోర్టు ఫలితాలు ఇవొచ్చని చెప్పినా, ఇవ్వకపోవడంతో అభ్యర్థుల్లో ఆందోళన పెరుగుతోందని, 2 వేల మందికి పైగా అభ్యర్థులు ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని టీడీపీ నాయకులు అంటున్నారు. వీలైనంత త్వరగా ఫలితాలు వెల్లడిస్తే భవిష్యత్తు నోటిఫికేషన్లకు అవకాశం ఏర్పడుతుందని అభిప్రాయపడుతున్నారు.

# పవన్ కళ్యాణ్ ను కలవాలని,,,,పిఠాపురం అంధ బాలిక కోరిక



**క్రైం కౌంటర్ న్యూస్ , జనవరి 26** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ?ను కలవాలని పట్టుబట్టిందో బాలిక. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ గెలుపు కోసం తన తండ్రి పడిన కష్టాన్ని తెలుసుకున్న తొమ్మిదేళ్ల అంధ బాలిక స్వాతి అన్నపూర్ణ.. ఆయన్ను కలవాల్సిందేనని స్కూల్?కు వెళ్లనని పట్టు పట్టింది. పవన్ కళ్యాణ్?ను కలిసి దేశభక్తి గీతం, హనుమాన్ చాలీసా పాడే వరకు తాను పాఠశాలకు వెళ్లనని తేల్చి చెప్పింది. విశాఖలోని భీమిలి నేత్రా విద్యాలయంలో తొమ్మిదేళ్ల అంధ బాలిక స్వాతి అన్నపూర్ణ నాలుగో తరగతి చదువుతోంది. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చి తన కోరిక తీర్చాలని ఇంట్లోనే ఉండిపోయింది. గతంలో స్వాతి తండ్రి పవన్ కళ్యాణ్?ను కలిసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు.యు.కొత్తపల్లి మండలం ముమ్మిడివారిపోడు గ్రామానికి చెందిన నల్లా ఏసుబాబు, రాణి దంపతుల పెద్ద కుమార్తె స్వాతి అన్నపూర్ణ. ఈమె పుట్టుకతోనే అంధురాలు. పవన్ కళ్యాణ్?కు హనుమాన్ అంటే ఇష్టమని తెలుసుకున్న స్వాతి.. హనుమాన్ చాలీసాను సాధన చేసింది. పవన్ గెలుపు కోసం తన తండ్రి పడిన కష్టాన్ని గుర్తుచేసుకుని.. పవన్ కళ్యాణ్?ను కలిసి తాను నేర్చుకున్న దేశభక్తి గీతం, హనుమాన్ చాలీసా వినిపించాలని ఆమె కోరుకుంటోంది. ఈ కోరిక తీరే వరకు పాఠశాలకు వెళ్లేది లేదని ఆమె మొండికేసింది. స్వాతి తండ్రి నల్లా ఏసుబాబు తన కుమార్తె కోరిక తీర్చడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. బాలిక కోరిక తీర్చడానికి ఆమె తండ్రి నల్లా ఏసుబాబు పడుతున్న కష్టం అంతా ఇంతా కాదు. తన కుమార్తె పవన్? కళ్యాణ్?ను కలిసే అవకాశం కల్పించాలని ఆయన వేడుకుంటున్నారు. తన కుమార్తెకు ఇది ఒక పెద్ద కల అని, అది నెరవేరితే ఆమె ఎంతో సంతోషిస్తుందని ఆయన అంటున్నారు. చిన్నారి స్వాతి అన్నపూర్ణ కోరికను తీర్చేలా జనసేన కార్యకర్తలు కానీ, అధికారుల కానీ స్పందించి అపాయింట్?మెంట్ వచ్చేలా చూడాలంటున్నారు. ఈ విషయాన్ని పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లాలని స్వాతి తండ్రి ఏసుబాబు కోరుతున్నారు. మరి ఆమె కోరిక ఎప్పుడు తీరుతుందో చూడాలి.

# జగన్ ప్రభుత్వం నాటి ఇసుక బిల్లుల క్లియరెన్స్‌కు ఏపీఎండీసీలో కదలిక

**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 26,** గత జగన్ ప్రభుత్వం నాటి ఇసుక బకాయిలను చెల్లించేందుకు ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) సిద్ధమవుతోంది. నాడు అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చినా.. నేతల ఒత్తిళ్లు, పీజీఆర్ఎస్‌లో వరస ఫిర్యాదులతో ఒత్తిడి పెరుగుతుండటంతో బకాయిలను సెటిల్ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా బిల్లుల చెల్లింపుపై అధ్యయనం కోసం నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ ఏపీఎండీసీ ఎండీ ప్రవీణ్‌కుమార్ తాజాగా ఆదేశాలు జారీ చే శారు. ఈ కమిటీలో గత జగన్ ప్రభుత్వంలో నియమితులై, ఇప్పటికీ ఎండీసీలో కీలక హోదాలోనే కొనసాగుతున్న ఓ వైస్ ప్రెసిడెంట్, ఎండీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ముఖ్య ఆర్థిక అధికారి(సీఎఫ్ఓ), ఫైనాన్స్, అకౌంట్స్ విభాగం చూసే డిప్యూటీ జనరల్ మేనేజర్, కంపెనీ కార్యదర్శి, ఆడిట్ విభాగం అధికారి సభ్యులుగా ఉంటారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక అమ్మకాలను ప్రైవేటు కంపెనీ జేపీ వెంచర్స్‌కు అప్పగించడానికి ముందు ఏడాదిపైనే ఏపీఎండీసీ నేతృత్వంలో ఇసుక నిర్వహణ జరిగింది. ఇందుకోసం ఏపీఎండీసీ జిల్లా, డివిజన్, మండలాల వారీగా ప్రైవేటు ఏజెన్సీలు, సంస్థలను ఎంపిక చేసి వాటి ద్వారా ఇసుక అమ్మకాలు నిర్వహించింది. అప్పట్లో నాటి అధికార వైసీపీ నేతలు కొందరు తమ ప్రధాన అనుచరులు, బినామీలను ముందుపెట్టి ఇసుక కాంట్రాక్టులు తీసుకున్నారు. కొందరు నిజంగానే పారదర్శకంగా టెండర్లు దక్కించుకున్నారు. 2019 సెప్టెంబరు నుంచి 2021లో ప్రైవేటు ఏజెన్సీకి కాంట్రాక్ట్ ఇచ్చేవరకు ఏపీఎండీసీనే ఇసుక వ్యాపారాన్ని చూసుకుంది. ఈ సమయంలో వైసీపీ నేతలు భారీగా ఇసుక వ్యాపారాలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇసుక అమ్మకాల్లో ఎండీసీకి డబ్బులు వచ్చాయి కానీ, ఇసుక రవాణా చేసిన వారికి, కాంట్రాక్టులు చేసిన మరికొందరికి బిల్లులు చెల్లించలేదు. తమకు బిల్లులు చెల్లించాలని కొందరు కోర్టును ఆశ్రయించారు.బిల్లులను ఎందుకు పెండింగ్ పెట్టార ని హైకోర్టు పలుమార్లు చీవాట్లు పెట్టింది. తప్పనిసరి పరిస్థితుల్లో కొంద



రు కాంట్రాక్టర్లకు బిల్లులు సెటిల్ చేశారు. కానీ ఇంకా భారీగానే సెటిల్ చేయాల్సి ఉంది. ఇందులో నాటి వైసీపీ నేతలు, లోగడ కీలక ప్రజాప్రతినిధులుగా వ్యవహరించిన వారి ప్రధాన అనుచరుల బకాయిలు కూడా ఉన్నాయి. ఇసుక అమ్మకాలకు సంబంధించి పలువురిపై ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి వారు కోర్టుకు వెళ్లలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ బిల్లులు చెల్లించాలన్న ఒత్తిళు రకరకాల పద్ధతుల్లో వచ్చినా స్పందించలేదు. ఇప్పుడు కొందరు వైసీపీ నేతలు తమకు తెలిసిన అధికారుల ద్వారా ఇసుక బకాయిల చెల్లింపు అంశాన్ని తెరమీదకు తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. అనూహ్యంగా ఈ అంశంపై ఏపీఎండీసీలోనూ కదలిక వచ్చింది. నాడు ఇసుక అమ్మకాల్లో ఏం జరిగిందో నిగ్గు తేల్చకుండా, ఇప్పుడు ఆ బకాయిల చెల్లింపుపై అధ్యయనానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది.

# నిన్ను పందిని నరికి కోసినట్లు కోస్తాం..కిర్రాక్ ఆర్పీకి వైసీపీ నేత వార్నింగ్



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 26,** తిరుమల కల్తీ నెయ్యి కేసులో అధికార టీడీపీ, విపక్ష వైసీపీ నేతల మధ్య మళ్లీ మాటల యుద్ధం మొదలైంది. వైసీపీ హయాంలో టీటీడీకి సరఫరా చేసిన నెయ్యి, అసలు నెయ్యే కాదంటూ సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం తేల్చింది. ఈ కేసుకు సంబంధించి నెల్లూరు ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు ఫైనల్ ఛార్జ్?షీట్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలోనే వైసీపీ, టీడీపీ మధ్య తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంపై మరోసారి మాటల మంటలు చెలరేగుతున్నాయి. ఈ క్రమంలోనే టీడీపీ మద్దతుదారుడు, కమెడియన్ కిరాక్ ఆర్పీ పై.. వైసీపీ నేత సంచలన వ్యాఖ్యలు చేశారు. గుంటూరుకు చెందిన వైసీపీ నేత కొరిటిపాటి ప్రేమ్ కుమార్.. కిరాక్ ఆర్పీని ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి ఆర్కే రోజాను ఉద్దేశించి కిరాక్ ఆర్పీ చేసిన వ్యాఖ్యలు ప్రస్తావిస్తూ కొరిటిపాటి ప్రేమ్ కుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో పంది కొవ్వు కలిసిందని ఆరోపిస్తూ.. గతంలో కిరాక్ ఆర్పీ, మాజీ మంత్రి రోజాపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. సిట్ నివేదిక నేపథ్యంలో ఈ వ్యాఖ్యలను మరోసారి తెరపైకి తెచ్చిన ప్రేమ్ కుమార్.. కిరాక్ ఆర్పీపై ఓ రేంజులో విరుచుకుపడ్డారు. తిరుమల లడ్డూలో కల్తీ జరగలేదని సిట్ చెప్పిందన్న ప్రేమ్ కుమార్.. కిరాక్ ఆర్పీని ఇప్పుడు ఏం చేయాలని ప్రశ్నించారు. ఇష్టానుసారం మాట్లాడిన కిరాక్ ఆర్పీని.. తాము అధికారంలోకి వస్తే పందిని కోసినట్లు నరికి కోస్తామంటూ ప్రేమ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు.కూటమి పాలనలో ఏం మాట్లాడినా మనోభావాలు దెబ్బతిన్నాయని జైలుకు పంపుతున్నారని.. కిరాక్ ఆర్పీ మాటలతో హిందువుల మనోభావాలు దెబ్బతినలేదా అని ప్రశ్నించారు. వైసీపీ నేతలను, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గురించి ఇష్టానుసారం మాట్లాడుతున్న కిరాక్ ఆర్పీని.. పందిని నరికి కోసినట్లు.. కోస్తాం ఖబడ్దార్ అంటూ ప్రేమ్ కుమార్ వార్నింగ్ ఇచ్చారు.

మరోవైపు ఏపీ ఎన్నికల సమయంలో కిరాక్ ఆర్పీ తెలుగుదేశం పార్టీ తరుపున ప్రచారం నిర్వహించారు. ఎన్నికలకు ముందు నుంచి టీడీపీ మద్దతుదారుడిగా ఉన్న కిరాక్ ఆర్పీ.. ఎన్నికల సమయం నుంచి పూర్తిస్థాయిలో టీడీపీ తరుపున రాజకీయాల్లో ఉన్నారు. ఈ క్రమంలో విపక్ష వైసీపీ నేతలపైనా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విధానాలపైనా కిరాక్ ఆర్పీ స్పందిస్న్?ంటారు. ఈ విధంగా తిరుమల లడ్డూ వ్యవహారం సమయంలోనూ కీలక వ్యాఖ్యలు చేశారు. మరోవైపు తిరుమల లడ్డూ కల్తీ కేసులో ఛార్జ్?షీట్ దాఖలు చేసి సిట్.. లడ్డూ తయారీకి సరఫరా చేసిన నేయిలో అసలు పాలే లేవని తేల్చింది. పామాయిల్, పామ్ కర్నెల్ ఆయిల్?తో చేసిన పదార్థాన్ని నెయ్యి అంటూ సరఫరా చేసినట్లు వెల్లడించింది.

# రాష్ట్ర మంత్రులతో ఎంపీలు సమన్వయం కావాలి

**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 26,** తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి మంత్రులతో పాటు ఎంపీలు తప్పనిసరిగా హాజరుకావాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. రాష్ట్ర మంత్రులతో సమన్వయం కోసం ప్రతి ఎంపీకి కొన్ని శాఖలను అప్పగించినట్లు ఆయన వెల్లడించారు. సంబంధిత శాఖా మంత్రి పార్టీ కార్యాలయానికి వచ్చినప్పుడు, ఆ శాఖకు కేంద్రంతో సమన్వయం చేసే ఎంపీ కూడా హాజరుకావాలని సూచించారు.తెలుగుదేశం పార్టీ ఎంపీలతో ఆయన నిన్న ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దాదాపు గంట పాటు సాగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. ప్రజా దర్బార్?లో మంత్రులు, ఎంపీలు కలిసి పాల్గొనడంతో పాటు, శాఖాపరమైన అంశాలపై కేంద్రంతో సమన్వయం కోసం పరస్పరం చర్చించుకోవాలని నారా లోకేశ్ సూచించారు. ప్రస్తుతం రెండు సెషన్ల కింద బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో, మొదటి సెషన్ అనంతరం వచ్చే విరామ సమయంలో ప్రతి ఎంపీతో వ్యక్తిగతంగా సమావేశమై అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.కేంద్రం వద్ద పెండింగ్?లో ఉన్న రాష్ట్ర సమస్యలపై ఎంపీలు పూర్తి అవగాహనతో అప్?డేట్?గా ఉండాలని లోకేశ్ సూచించారు. నియోజకవర్గాల్లో కార్యకర్తలు, ఎమ్మెల్యేల మధ్య బంధం మరింత బలపడేలా ఎంపీలు కృషి చేయాలని కోరారు.

# సుజలాం.. సస్యశ్యామలాం! కేంద్ర నిధులతో రాష్ట్రమంతా జలకళ

**రెండు దశల్లో రూ.10 వేల కోట్లు!**
**కేంద్రం సూత్రప్రాయ అంగీకారం**
**రాయలసీమ, నెల్లూరు, ప్రకాశంలో పండ్ల తోటలు, సాగునీటికి ఊతం**
**మౌలిక సదుపాయాలూ అభివృద్ధి**
**రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి లక్ష్యం**
**గరిష్ఠ స్థాయిలో 'పూర్వోదయ' నిధులకు యత్నం**
**సంబంధిత శాఖలపై నేడు సీఎం కీలక సమీక్ష**



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 26,** కేంద్ర పథకాలను గరిష్ఠ స్థాయిలో ఉపయోగించుకోవడం... భారీగా కేంద్ర నిధులు సాధించడం... రాయలసీమ, ప్రకాశం, పశ్చిమ నెల్లూరు జిల్లాలను 'సస్యశ్యామలం' చేయడం! దీంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి, పొలాలకు 'సుజలాలు' ప్రవహించడం! ఈ రెండు బృహత్ లక్ష్యాలు పూర్తి చేసే దిశగా ప్రణాళికలు రూపుదిద్దుకోనున్నాయి. దీనికి నిధులు ఇచ్చేందుకు కేంద్రం ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. గ్రామీణాభివృద్ధి, జల వనరులకు సంబంధించి కేంద్రం అమలు చేస్తున్న వివిధ పథకాల నుంచి రాష్ట్రానికి రూ.10వేల కోట్లు వచ్చే అవకాశం కనిపిస్తోంది. రెండు దశల్లో రూ.10,000 కోట్లు రాష్ట్రానికి ఇచ్చేందుకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. అలాగే... పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి రూ.14,100 కోట్లు అవసరమని ఇప్పటికే గుర్తించారు. కేంద్రం అమలు చేస్తున్న 'పూర్వోదయ' పథకం ద్వారా గరిష్ఠ స్థాయిలో నిధులు సాధించేందుకు రంగం సిద్ధం చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కేంద్రం నుంచి అందే ఈ నిధులను సమర్థంగా వినియోగించుకుని, సత్వర ఫలితాలు సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక, వ్యవసాయ-అనుబంధ, ఉద్యానవన, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, జల వనరుల శాఖలను ఆదేశించారు. దీనిపై మంగళవారం ఆయా శాఖలతో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్రం నుంచి అందే నిధులు, చేపట్టే పనులపై ఈ భేటీలో పూర్తిస్థాయి స్పష్టత వచ్చే అవకాశముంది. 'సుజలాం - సస్యశ్యామలాం' లేదా మరో పేరుతో రాష్ట్రవ్యాప్తంగా జలగలగలలు వినిపించేలా బృహత్తర ప్రణాళికను అమలు చేయనున్నట్లు తెలిసింది.

ఉద్యాన వన'సీమ'

ఒకప్పుడు కరువు సీమగా పేరొందిన రాయలసీమ ఇప్పటికే పండ్ల తోటలకు (హార్టికల్చర్) చిరునామాగా మారింది. ఇప్పుడు రాయలసీమతోపాటు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పశ్చిమ ప్రాంతం, ప్రకాశం జిల్లాలనూ కలిపి 'హార్టికల్చర్ హబ్'గా మార్చేందుకు కేంద్ర నిధులను ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. దీనికోసం కేంద్రం రెండు దశల్లో రూ.10వేల కోట్లు ఇచ్చేందుకు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. ఆ జిల్లాల్లో పండ్లతోటలకు, పొలాలకు నీరందించడతోపాటు, వాటి రవాణా కోసం గ్రామీణ రహదారులను అభివృద్ధి చేస్తారు. దీనికోసం 'జీరామ్‌జీ' (ఉపాధి హామీ)పథకం, వాటర్ షెడ్, బిందు సేద్యం సంబంధిత కేంద్ర ప్రాజెక్టుల నుంచి నిధులు రాబడతారు. పండ్ల తోటలకు నీరందించడం నుంచి మార్కెటింగ్‌కు అవసరమైన రవాణా దాకా ప్రతి దశలో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తారు.

'పూర్వోదయ' ద్వారా...

తూర్పు తీరంలో ఉన్న ఆంధ్రప్రదేశ్, ఒడిసా, పశ్చిమ బెంగాల్‌తోపాటు బిహార్, జార్ఖండ్ రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం 'పూర్వోదయ' పథకం పరిధిలోకి తెచ్చింది. ఈ ఐదు రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, ఆర్థికాభివృద్ధికి నిధులు కేటాయించి... వేగవంతమైన అభివృద్ధికి బాటలు పరచడం, 'వికసిత్ భారత్'లో తూర్పు భారత భాగస్వామ్యాన్ని కీలకంగా మార్చడమే ఈ పథకం లక్ష్యం. దీని ద్వారా రాష్ట్రానికి గరిష్ఠ స్థాయిలో నిధులు రాబట్టేందుకు సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. ఈ పథకం ద్వారా అందే నిధులతో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. అదే జరిగితే 3,97,339 ఎకరాల కొత్త ఆయకట్టు ఏర్పాటవుతుంది. 25 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చు. తోటపల్లి బ్యారేజీ, తారకరామతీర్థ సాగర్, వంశధార రెండో దశలో స్టేజ్-2, గొట్టా బ్యారేజీ ఎత్తిపోతల నుంచి హిరమండలం దాకా నీటి తరలింపు, మహేంద్ర తనయ ఆఫ్‌షోర్, గజపతినగరం బ్రాంచి కెనాల్, వంశధార-నాగావళి లింక్ కెనాల్, నాగావళి - చంపావతి అనుసంధానం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాల పూర్తికి రూ.5వేల కోట్లు అవసరమని జల వనరుల శాఖ అంచనా వేసింది. గోదావరి డెల్టా సిస్టమ్ కాలువల అభివృద్ధి, కృష్ణా డెల్టా సిస్టమ్ కాలువల అభివృద్ధి, బుడమేరు, ఉప్పుటేరు కాలువల అభివృద్ధి, బుడమేరు కాలువ మళ్లింపు, వరికెలపూడిశెల, ఏఎసఆర్ సోమశిల హెచ్‌ఎల్‌సీ ప్రాజెక్టు తొలిదశ... ఈ పనుల పూర్తికి రూ.9100 కోట్లు అవసరం. అంటే... మొత్తంగా రూ.14,100 కోట్లతో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయవచ్చు. 'పూర్వోదయ' నిధులను ఈ ప్రాజెక్టుల పూర్తికి ఉపయోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

ప్రాజెక్టులపై ఫోకస్

2024లో అధికారంలోకి వచ్చాక 100 రోజుల్లోనే హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రధాన కాలువను అభివృద్ధి చేయడం ద్వారా కుప్పం దాకా నీటిని తీసుకు వెళ్లగలిగారు. ప్రాజెక్టులలో సమర్థ నీటి యాజమాన్య విధానాలను ఆచరించడం ద్వారా భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. ప్రాజెక్టులను పూర్తి చేసి.. వరదల కాలంలో నీటిని ఎత్తిపోతల పథకాలు, చెరువుల్లోకి పంపించడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని గడచిన రెండేళ్లుగా అమలు చేస్తున్న నీటి యాజమాన్య విధానాలు రుజువు చేశాయి. దీంతో... పెండింగ్ ప్రాజెక్టుల పూర్తిపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది.

'ప్రణాళికా' బద్ధంగా...

'సుజలాం - సస్యశ్యామలం' కోసం కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు ముఖ్యమంత్రి కొన్నాళ్లుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. తన ఢిల్లీ పర్యటనల్లో దీనిపైనే దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో... రెండు దశల్లో రూ.10వేల కోట్లు ఇచ్చేందుకు కేంద్రం ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపినట్లు సమాచారం. అలాగే... పెండింగ్ ప్రాజెక్టుల కోసం 'పూర్వోదయ' నిధులను గరిష్ఠ స్థాయిలో రాబట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. మంగళవారంనాటి సమావేశంలో శాఖల వారీగా సమగ్ర నివేదికలను యుద్ధ ప్రాతిపదికన తయారు చేయాలని సూచిం చే అవకాశముంది.

# విజయవాడ దుర్గ గుడిలో అలా చేస్తే .... క్యూ కడుతున్న భక్తులు

**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 26,** విజయవాడ దుర్గమ్మ దర్శనం కోసం నిత్యం వేలాదిమంది భక్తులు తరలివస్తుంటారు. అయితే దుర్గమ్మ ఆలయం విషయంలో సోషల్ మీడియాలో కొందరు చేస్తున్న ప్రచారంతో ఇంద్రకీలాద్రిపై హడావిడి కనిపిస్తోంది. కొందరు భక్తులు చేస్తున్న పనులు ఆలయ అధికారులకు కొత్త తలనొప్పులు తెచ్చి పెడుతున్నాయి. విజయవాడ దుర్గమ్మ గుడి వద్ద ఇటీవల రెండు సంఘటనలు చర్చనీయాంశం అయ్యాయట. ఎవరో ఒకసారి స్వామి సోషల్ మీడియాలో చెప్పిన మాటలు విని.. హైదరాబాద్ నుంచి వెయ్యి మంది భక్తులు విజయవాడ దుర్గమ్మ గుడికి వచ్చారట. తాము ఎక్కడ పారాయణం చేయాలో చెప్పాలని.. తమకు మైక్, దర్శనం, భోజన వసతి ఏర్పాటు చేయాలన్నారట. ఇలా అమ్మవారి ఆలయంలో పారాయణం చేస్తే ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయని మరొకరు ప్రచారం చేశారట. ఈ మాట విని 500 మంది భక్తులు గుడికి వచ్చి, సెక్యూరిటీ సిబ్బందితో గొడవపడ్డారట.విజయవాడ దుర్గగుడిలో అర్చకులు, సిబ్బంది నిత్యం పూజలు, ఆర్జిత సేవల నిర్వహణలో బిజీగా ఉంటారు. అయితే ప్రస్తుతం సోషల్ మీడియాలో కొందరు చేస్తున్న ప్రచారం ఆలయంపై ఒత్తిడి పెంచుతోందనే చర్చ జరుగుతోందట. కొందరు దుర్గమ్మ ఆలయంలో పూజల చేయాలని, ప్రసాదాలు పంచాలని, పారాయణాల గురించి ప్రచారం చేస్తున్నారట. ఈ ప్రచారాన్ని నమ్మిన భక్తులు, తాము కోరుకున్న పూజలు చేయించుకోవడానికి ఆలయానికి వస్తున్నారట. కానీ ఆలయంలో అలాంటి పూజలు లేవని అధికారులు చెబుతున్నారట. కొందరు అక్కడ గొడవలకు దిగుతున్నారట.. అలా వచ్చిన భక్తులకు నచ్చజెప్పి అమ్మవారి దర్శనం చేయించి పంపిస్తున్నారట. ఈ క్రమంలో ఆలయ సిబ్బందికి ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయట. భక్తుల నమ్మకాలను వమ్ము చేయకుండా, ఆలయ పవిత్రతను కాపాడుతూనే, ఈ సమస్యను పరిష్కరించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. విజయవాడ దుర్గమ్మ ఆలయానికికొంతమంది భక్తులు బయటి నుంచి తెచ్చిన ప్రసాదాలు పంచేందుకు ప్రయత్నిస్తున్నారట. ఆ భక్తుల్ని భద్రతా



సిబ్బంది అడ్డుకోవడంతో అక్కడ చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయట. ఇటీవల కొందరు వ్యక్తులు.. ఎవరో ఒక స్వామి ఐదు రకాల ప్రసాదాలు, స్త్రీలకు రవికెలు, గాజులు పంచితే సంపద పెరుగుతుందని చెప్పారట. ఈ క్రమంలో చాలామంది భక్తలు పెద్ద సంఖ్యలో ఆటోల్లో ఆలయానికి వచ్చారట. ఈ సంఘటనతో ఆలయ అధికారులు, భద్రతా సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఎక్కడెక్కడి నుంచో, ఎవరో తెచ్చిన ప్రసాదాలను ఆలయంలో పంచడం వల్ల భక్తుల భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ పొరపాటున ఏదైనా జరగరానిది జరిగితే బాధ్యత ఎవరిదనే ప్రశ్న తలెత్తుతోంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు, భక్తులను తప్పుదోవ పట్టించే వారిని ఎలా కట్టడి చేయాలోనని ఆలోచన చేస్తున్నారట. సోషల్ మీడియా వేదికగా దుర్గమ్మ పేరుతో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించే పనిలో ఉన్నారట. భక్తులు కూడా ఇలాంటి మాటలు నమ్మొద్దని.. ఆలయ అధికారుల సూచనలను పాటించాలని కోరుతున్నారు.

# జోగి రమేష్ ని కలిసిన మాజీ మంత్రి విడుదల రజినీ

**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 26,** ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి జోగి రమేష్?ను, చిలకలూరిపేట మాజీ మంత్రి విడుదల రజనీ మర్యాదపూర్వకంగా కలిసి సంఘీభావం తెలిపారు. కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎదుర్కొంటూ ధైర్యంగా నిలబడుతూ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న జోగి రమేష్?కు వైసిపి పార్టీ తరపున అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని కుతంత్రాలు చేసినా రాబోయే రోజుల్లో వైసిపి పార్టీ అధికారంలోకి వస్తుందని ఆమె జోష్యం చెప్పారు.

# ప్రజల్లో మళ్లీ విశ్వాసం!

**రాజధాని పనులు నిలిచిపోయాయి**
**పెట్టుబడిదారుల్లో నమ్మకం పోయింది**
**కూటమి ప్రభుత్వ దిద్దుబాటుతో ఫలితాలు కనిపిస్తున్నాయి: గవర్నర్**



**క్రైం కౌంటర్ న్యూస్,**అమరావతి, జనవరి 26: రాజధాని అమరావతిలో తొలిసారి గణతంత్ర వేడుకలు జరుపుకోవడం చరిత్రాత్మకమని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. కొన్నేళ్ల పాటు రాష్ట్రానికి దశ, దిశ లేకుండా రాజధాని ప్రాజెక్టు పనులు నిలిచిపోయి, ఆర్థిక విశ్వాసం దెబ్బతిందని.. రాజధాని నిర్మాణం కొనసాగించకపోవడంతో పెట్టుబడిదారుల్లో నమ్మకం సన్నగిల్లిందని చెప్పారు. ఈ సవాళ్ల మధ్య కూటమి ప్రభుత్వం తిరిగి పనులు ప్రారంభించి రాష్ట్ర ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఫలితాలు ఇప్పుడిప్పుడే స్పష్టంగా కనిపిస్తున్నాయని, ప్రాజెక్టులు ముందుకు కదులుతున్నాయని.. జనంలో తిరిగి నమ్మకం కలిగిస్తున్నామని తెలిపారు. సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజధాని అమరావతిలోని నేలపాడులో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో ఆయన జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రసంగించారు. వీడియో సందేశం కూడా విడుదల చేశారు. 'ప్రియమైన ఆంధ్రప్రదేశ్ సోదర, సోదరీమణులందరికీ 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు, అభినందనలు. భగవంతుడి ఆశీస్సులు మీ అందరికీ ఉండాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఎంచుకున్న పది సూత్రాల అమలుతో లక్ష్యాలను నెరవేరుస్తామన్న నమ్మకం కలుగుతోందన్నారు. 'తెలుగు ప్రజలు ప్రగతి శిల్పులు.. లక్షల మందిని పోషిస్తున్న మన రైతులు, ప్రమాదాలను లెక్కచేయకుండా సముద్రపు అలలతో పోరాడే మత్స్యకారులు, మనసులను వెలిగించే ఉపాధ్యాయులు, కరుణతో సేవ చేసే ఆరోగ్య కార్యకర్తలు, కొత్త ఆలోచనలకు రూపమిచ్చే మేధావులు, భవిష్యత్‌ను నిర్మిస్తున్న మహిళలను, జీవనోపాధులను సృష్టిస్తున్న వ్యాపారవేత్తలను ఇక్కడ చూస్తున్నాను' అని ఉద్ఘాటించారు. ప్రతి కుటుంబానికి సాధికారిత కల్పించేందుకు ప్రభుత్వం సూపర్‌సిక్స్ అమలు చేస్తోందని తెలిపారు.

ఆయన ఇంకా ఏమన్నారంటే..సంపద సృష్టితో సంక్షేమం..

సంపద సృష్టితో విస్తృత సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి అందరి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా బలహీన వర్గాలకు అండగా నిలుస్తోంది. వృద్ధులకు నెలవారీ పెన్షన్ దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, డయాలసిస్, కిడ్నీ బాధితులకు రూ.10 వేలు, ప్రమాద బాధితులకు రూ.15 వేలు చొప్పున అందిస్తున్నాం. దీపం 2.0 ద్వారా సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు 1.08 కోట్ల పేద లబ్ధిదారులకు అందిస్తున్నాం. స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ప్రారంభించాం. ఎస్సీ వర్గీకరణ చేశాం. బీసీలకు ఈ ఏడాదిలో బీసీ కార్పొరేషన్ల ద్వారా రూ.11,620 కోట్లు అందించేందుకు ప్రణాళికలు రూపొందించాం. వారికి చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌కు మద్దతిస్తూ, స్థానిక సంస్థల్లో 34 శాతం కోటాకు కృషి చేస్తున్నాం. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాల్లో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తాం. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ ద్వారా సాయం, సమాచారం, న్యాయం సత్వరమే ప్రజలకు అందిస్తున్నాం. అందరం కలిసి ఆరోగ్య, సంపద, ఆనందకరమైన సమాజాన్ని నిర్మిద్దాం.2047 నాటికి రూ.3.8 లక్షల కోట్ల ఎకానమీ!

రాష్ట్రప్రభుత్వం పేదరికాన్ని తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్యను భారీగా పెంచుతోంది. ఇప్పటికే జీరో పావర్టీ, పీ-4 పాలసీని చేపట్టింది. 2047 నాటికి పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసింది. 2047 నాటికి రూ.3.8 లక్షల కోట్ల ఎకానమీ సాధించడమే లక్ష్యంగా పెట్టుకుంది. వికసిత్ భారత్ విజన్-2047తో కలిసి రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం 55 లక్షలకు పెంచాలని టార్గెట్ పెట్టుకుంది. 15 శాతం వృద్ధి రేటు సాధించేందుకు వ్యవసాయం, పరిశ్రమలు, సంక్షేమం, పెట్టుబడుల రంగాల్లో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. పెట్టుబడిదారుల అనుకూల విధానాలు తీసుకొచ్చింది. ప్రతిపాదిత పెట్టుబడుల్లో ఏపీ మొదటి స్థానంలో ఉంది. 2025-26లో దేశంలో ప్రతిపాదిత పెట్టుబడుల్లో నాలుగో వంతు సాధించింది.

# ముద్రగడ టీడీపీలో చేరబోతున్నారా?



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 26,** పెద్దాపురం టీడీపీ ఎమ్మెల్యే చినరాజప్పతో వైసీపీ కీలక నేత ముద్రగడ పద్మనాభం భేటీ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. 2024 ఎన్నికల ముందు వైసీపీలో చేరిన ముద్రగడ కూటమిని ఓడించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే కూటమి పాలనపై ప్రజా వ్యతిరేకత నెమ్మదిగా వస్తోంది. దాన్ని క్యాష్ చేసుకోవాలని ముద్రగడకు జగన్ దిశానిర్దేశం చేశారు. ఆ పనిలో చురుకుగా ఉన్న ముద్రగడ ఇప్పుడు చినరాజప్పను కలవడంపైనే చర్చ సాగుతోంది. దాంతో ముద్రగడ టీడీపీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని పుకార్లు వినిపిస్తున్నాయి.

# సినిమా



## ఆ సినిమా తర్వాతే నా లైఫ్ మారిపోయింది.

టాలీవుడ్ నటుడు అజయ్ గురించి ప్రత్యేకంగా పరిచయం చెప్పక్కర్లేదు. తెలుగు సినిమాల్లో నటుడిగా, విలన్ గా ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అటు భయంకరమైన విలన్ గా నటిస్తూనే.. ఇటు తన కామెడీ టైమింగ్ తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. ఇప్పుడు చేతినిండా సినిమాలతో బిజీగా ఉంటున్నారు. అయితే మాస్ మహారాజా రవితేజ నటించిన విక్రమార్కుడు సినిమా తన జీవితాన్ని మార్చేసిందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. విక్రమార్కుడు సినిమా భారీ విజయం సాధించిన తర్వాత తనకు మరిన్ని అవకాశాలు వచ్చాయని అన్నారు. ఆ మూవీ విడుదలైన తర్వాత తనకు నాలుగైదేళ్లు భారీగానే పారితోషికాలు ఇచ్చారని గుర్తుచేసుకున్నారు.బయటి ఉద్యోగాలతో పోలిస్తే సినీరంగంలో విజయం సాధిస్తే రాత్రికి రాత్రే భారీగా సంపాదించవచ్చని తాను భావించానని అన్నారు. సినీరంగంలో నిలదొక్కుకోవాలంటే సహనం, ఓపిక అవసరమని అన్నారు. మొదటి పదేళ్లు ఎలాంటి ఫలితాలు కనిపించకపోవచ్చని.. కానీ విజయం సాధించే శాతం చాలా తక్కువగా ఉంటుందని అన్నారు. బయట ఉన్నవాళ్లకు కోట్ల పారితోషికాలు ఎక్కువగా అనిపించినా.. సినిమా కోసం పడే కష్టాలు, పోరాటాలు, సహనం, ఎదురుచూపులు, అలాగే విఫలమైతే ఎదురయ్యే పరిస్థితులు వారికి కనిపించవని అజయ్ అన్నారు.తన కెరీర్ మలుపు తిప్పిన సినిమా విక్రమార్కుడు అని.. ఆ మూవీ తనకు పేరు తెచ్చిపెట్టిందని అన్నారు. ఆ సినిమా తర్వాత తనకు దాదాపు పది నుంచి ఇరవై వరకు అవకాశాలు వచ్చాయని అన్నారు. లక్ష్మీ కళ్యాణం, ఆర్య 2, ఇష్క్, బృందావనం సినిమాలలోని పాత్రలు తనకు ఇష్టమని వెల్లడించారు






## మనం పైనాపిల్ ను తింటే.. అది మనల్ని తింటుందా.

పైనాపిల్..చూడగానే నోరూరించే పండు.. తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు. కానీ పైనాపిల్?ను ఒక్క ముక్క నోట్లో పెట్టుకోగానే నాలుకపై చిన్నపాటి మంట, దురద లేదా ఏదో గుచ్చుకున్నట్లు అనిపిస్తుంది. చాలామంది ఇది పండులో ఏదైనా లోపం ఏమో అని భయపడతారు. కా, దీని వెనుక ఒక ఆసక్తికరమైన జీవక్రియ దాగి ఉంది. పైనాపిల్?లో బ్రోమెలైన్ అనే శక్తివంతమైన ఎంజైమ్ ఉంటుంది. ఇది ప్రోటీన్లను విచ్ఛిన్నం చేయడం సిద్ధహస్తురాలు. సాధారణంగా మనం ఆహారాన్ని జీర్ణం చేసుకుంటాం.. కానీ పైనాపిల్ విషయంలో.. మనం దానిని నములుతున్నప్పుడు, అందులోని బ్రోమెలైన్ మన నోటిలోని సున్నితమైన కణజాలం, నాలుకపై ఉండే ప్రోటీన్లను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తుంది. అంటే సాంకేతికంగా చెప్పాలంటే.. మనం పైనాపిల్?ను తింటుంటే, పైనాపిల్ మనల్ని తింటుందన్నమాట. అయితే ఈ దురదను చూసి కంగారు పడక్కర్లేదు.

శరీరానికి మేలు

ఈ ఎంజైమ్ మన కడుపులోకి వెళ్లగానే అక్కడి జీర్ణ రసాల వల్ల అది జీర్ణమైపోతుంది. నిజానికి ఇది జీర్ణక్రియకు, శరీరంలో వాపులను తగ్గించడానికి ఎంతో మేలు చేస్తుంది. మన నోటిలోని కణాలు చాలా వేగంగా పునరుత్పత్తి చెందుతాయి. అందుకే పైనాపిల్ తిన్న తర్వాత కలిగే ఆ మొద్దుబారినట్లు ఉండే అనుభూతి కొద్దిసేపట్లోనే తగ్గిపోతుంది. పైనాపిల్ రుచిని ఆస్వాదిస్తూనే, ఆ దురద నుండి తప్పించుకోవడానికి ఇక్కడ కొన్ని చిట్కాలు ఉన్నాయి

ఉప్పు నీటి చిట్కా: పైనాపిల్ ముక్కలను కోసిన తర్వాత కొద్దిసేపు ఉప్పు నీటిలో నానబెట్టండి. ఉప్పు బ్రోమెలైన్ ప్రభావాన్ని తగ్గిస్తుంది.

వేడి చేయడం: పైనాపిల్?ను గ్రిల్ చేసినా లేదా ఉడికించినా అందులోని ఎంజైమ్లు నిర్వీర్యం అవుతాయి. అందుకే పైనాపిల్ పిజ్జా తిన్నప్పుడు నాలుక దురద పెట్టదు.

పండిన పండునే ఎంచుకోండి: పచ్చి పైనాపిల్?లో ఈ ఎంజైమ్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పండు బాగా పండిన తర్వాత తింటే ఈ సమస్య తక్కువగా ఉంటుంది.


మధ్య భాగం వద్దు: పైనాపిల్ మధ్యలో ఉండే గట్టి భాగంలో బ్రోమెలైన్ ఎక్కువగా ఉంటుంది. దానిని పక్కన పెడితే దురద తగ్గుతుంది.

పైనాపిల్ వల్ల కలిగే ఇతర ప్రయోజనాలు

ఇందులో క్యాలరీలు తక్కువ, ఫైబర్ ఎక్కువ ఉండడం వల్ల బరువు తగ్గాలనుకునేవారికి మంచిది.

విటమిన్-సి పుష్కలంగా ఉండటం వల్ల జలుబు, దగ్గు వంటి సమస్యల నుండి కాపాడుతుంది.

ఇందులో ఉండే మాంగనీస్ ఎముకలను బలంగా ఉంచుతుంది.



## కిడ్నీలో రాళ్లు.. తీవ్రమైన సమస్యకు ఈ 3 సింపుల్ టిప్స్?తో చెక్ పెట్టండి..!

ఇటీవల కాలంలో కిడ్నీలలో రాళ్లు అనేది సాధారణంగా మారిపోయింది. మారుతన్న జీవనశైలి, తీసుకునే ఆహారం, తదితర కారణాలతో చాలా మంది కిడ్నీలో రాళ్ల సమస్యను ఎదుర్కొంటున్నారు. రాళ్లు పెద్దవిగా ఉంటే కిడ్నీ ప్రాంతంలో తీవ్రమైన నొప్పి వస్తుంది. అందుకే కిడ్నీలోని రాళ్లు.. పెద్ద సమస్య కాకముందే జాగ్రత్తలు తీసుకోవాలి. కొన్ని ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల ఈ సమస్యను మొదట్లోనే పరిష్కరించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. మన కిడ్నీల్లో రాళ్లను కరిగించే లేదా బయటికి పంపించే సులభమైన మార్గాలు ఉన్నాయి. మనం తీసుకునే ఆహారం, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల కిడ్నీలో రాళ్ల సమస్యను తగ్గించవచ్చని వైద్యారోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వాటి గురించి తెలుసుకుందాం.

1. రోజూ సరిపడా నీరు తాగండి

నీటితో నీరు తాగడం వల్ల మూత్రం సాఫీగా వస్తుంది. మూత్రంలో ఖనిజాల సాంద్రత తగ్గుతుంది. డాక్టర్ సూచన ప్రకారం రోజుకు కనీసం 2.5 లీటర్ల వరకు నీరు తాగడం మంచిది. నీరు తాగడం ద్వారా చిన్న క్రిస్టల్స్(రాళ్లు) పెద్దవికాక ముందే బయటకు పోతాయి, అందువల్ల రాళ్ల సమస్య కూడా తగ్గుతుంది.

2. ఉప్పు తక్కువగా తీసుకోండి

ఎక్కువ సోడియం (ఉప్పు) ఉండే ఆహారం తీసుకుంటే కిడ్నీలు మీ శరీరంలో ఉన్న కాల్షియం ఎక్కువగా మూత్రంలో రిలీజ్ చేస్తాయి. ఈ కాల్షియం కిడ్నీ స్టోన్స్ ఏర్పాటు చేసుకోవడానికి కారణం కావచ్చు. అందుకే ఉప్పు ఒక్క చెంచా (సుమారు 5 గ్రాముల) కంటే ఎక్కువ తీసుకోవద్దు. పరిశోధనలు కూడా ఉప్పు తగ్గించడం వల్ల రాళ్ల సమస్య తగ్గిందని చెబుతున్నాయి.

3. సిట్రేట్లు ఉన్న పండ్లు ఎక్కువగా తినండి

నిమ్మకాయ, ఆరెంజ్, మోసంబి వంటి సిట్రేట్ పండ్లు కిడ్నీ స్టోన్స్? ఏర్పడకుండా నిరోధిస్తాయి. సిట్రేట్ కల్పించే ఆహారం కాల్షియాన్ని క్రిస్టల్ రూపంలో ఉండకుండా, మూత్రంలో కదలికగా ఉంచడంలో సహాయపడుతుంది. ఉదాహరణకి, నిమ్మరసం నీటిలో కలిపి ఉదయం మధ్యలో తాగటం చాలా మంచిది.

## గువాహటి టీ20లో అభిషేక్ విధ్వంసం,,,,మ్యాచ్ అనంతరం బ్యాట్ చెక్ చేసిన ప్లేయర్స్

గువాహటిలో జరిగిన న్యూజిలాండ్?తో మూడో టీ20 మ్యాచ్?లో టీమిండియా బ్యాటర్ అభిషేక్ శర్మ మెరుపు ఇన్నింగ్స్?తో సంచలనం సృష్టించాడు. కేవలం 14 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసి క్రికెట్ ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్నాడు. అభిషేక్ బ్యాటింగ్ వేగం చూసి న్యూజిలాండ్ ఆటగాళ్లు కూడా ఆశ్చర్యపోయారు. మ్యాచ్ ముగిసిన తర్వాత ఆయన బ్యాట్?ను సరదాగా చెక్ చేయడం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్?గా మారింది.

154 పరుగుల లక్ష్యాన్ని చేధించేందుకు దిగిన భారత్?కు ఆరంభంలోనే షాక్ తగిలింది. సంజూ శాంసన్ తొలి బంతికే డకౌట్?గా వెనుదిరిగాడు. అయితే ఆ తర్వాత అభిషేక్ శర్మ బాధ్యతలు తన భుజాలపై వేసుకుని కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ప్రతి బంతిని బౌండరీకి తరలిస్తూ మ్యాచ్?ను పూర్తిగా మార్చేశాడు

అభిషేక్ ధాటికి న్యూజిలాండ్ బౌలర్లు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. కేవలం 10 ఓవర్లలోనే భారత్ లక్ష్యాన్ని చేధించి 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్ అనంతరం న్యూజిలాండ్ ఆటగాళ్లు అభిషేక్ వద్దకు వచ్చి సరదాగా బ్యాట్?ను పరిశీలించారు. అభిషేక్ కూడా నవ్వుతూ బ్యాట్ ఇచ్చాడు. దీనిపై సోషల్ మీడియాలో నీ బ్యాట్?లో స్ప్రింగ్ ఉందా? అంటూ అభిమానులు జోకులు పేలుస్తున్నారు.

ఈ మ్యాచ్?లో అభిషేక్ శర్మ 20 బంతుల్లో 68 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్?లో 14 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేయడం ద్వారా టీ20ల్లో భారత ఆటగాళ్లలో సెకండ్ ఫాస్టెస్ట్ అర్ధశతకంగా నిలిచింది. యువరాజ్ సింగ్ 2007 టీ20 వరల్డ్?కప్?లో ఇంగ్లండ్?పై 12 బంతుల్లో అర్ధశతకం చేసిన రికార్డు ఇంకా అలానే కొనసాగుతోంది. ఆ రికార్డుకు అభిషేక్ చాలా దగ్గరగా వెళ్లాడు.

మ్యాచ్ అనంతరం అభిషేక్ మాట్లాడుతూ “జట్టు అవసరానికి తగ్గట్టు ఆడటమే నా లక్ష్యం. ప్రతిసారి ఇలాంటి ఇన్నింగ్స్ ఆడటం సులభం కాదు. డ్రెస్సింగ్ రూమ్ వాతావరణం చాలా కీలకం. యువరాజ్ పాజీ 12 బంతుల్లో అర్ధశతకం రికార్డు అసాధారణం. కానీ ప్రస్తుతం జట్టు మొత్తం ధైర్యంగా ఆడుతోంది. భవిష్యత్తులో ఏదైనా జరగొచ్చు” అని చెప్పాడు. ఈ విజయం ద్వారా భారత్ ఐదు మ్యాచ్?ల టీ20 సిరీస్?లో 3-0తో ఆధిక్యం సాధించింది.




## టీ20 ప్రపంచకప్ రేసులో రియాన్‌పరాగ్?..

రాబోయే మెగా టోర్నీ టీ20 వరల్డ్? కప్? కోసం భారత సెలక్టర్లు కసరత్తులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా జట్టులో కొన్ని కీలక మార్పులు చోటుచేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా యువ ఆల్?రౌండర్? వాషింగ్టన్ సుందర్ గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోకపోవడం టీమ్ మేనేజ్?మెంట్?ను కాస్త ఆందోళనకు గురిచేస్తోంది. ఒకవేళ టోర్నీ సమయానికి సుందర్ ఫిట్?నెస్ సాధించలేకపోతే, అతని స్థానాన్ని భర్తీ చేసేందుకు ప్రత్యామ్నాయ ఆటగాళ్లపై దృష్టి సారించారు.

ఈ క్రమంలో అద్భుతమైన ఫామ్?లో ఉన్న అస్సాం కుర్రాడు రియాన్ పరాగ్? పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. సెలక్టర్ల నుంచి పరాగ్?కు ఇప్పటికే పిలుపు అందినట్లు సమాచారం అందుతోంది. ఫిబ్రవరి 2వ తేదీన ముంబైలో రిపోర్ట్ చేయాల్సిందిగా అతనికి స్పష్టమైన ఆదేశాలు వెళ్లినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా దేశీవాళీ క్రికెట్?తో పాటు ఐపీఎల్?లోనూ పరాగ్ నిలకడగా రాణిస్తుండటం అతనికి పెద్ద ప్లస్ పాయింట్?గా మారింది.

ప్రస్తుతం జరుగుతున్న టీ20 సిరీస్?లో రవి బిష్ణోయి స్పెషలిస్ట్ స్పిన్నర్?గా జట్టులో ఉన్నప్పటికీ, ప్రపంచకప్ వంటి పెద్ద టోర్నీల్లో బ్యాటింగ్ చేయగల ఆల్?రౌండర్? ఉండాలని సెలక్టర్లు భావిస్తున్నారు. బంతితోనే కాకుండా బ్యాట్?తోనూ మెరుపులు మెరిపించగల సత్తా ఉండటం పరాగ్?కు కలిసొచ్చే అంశం. అందుకే తుది జట్టు సమతుల్యత కోసం బిష్ణోయి కంటే కూడా ఆల్?రౌండర్ కోటాలోనే మొగ్గు చూపే అవకాశం ఉంది.

జట్టులో చోటు కోసం తీవ్రమైన పోటీ నెలకొన్న తరుణంలో, రియాన్ పరాగ్?కు ఈ పిలుపు ఒక గొప్ప అవకాశమని చెప్పాలి. వాషింగ్టన్ సుందర్ ఫిట్?నెస్ రిపోర్ట్ ఆధారంగానే పరాగ్ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఒకవేళ సుందర్ తప్పుకుంటే, ప్రపంచకప్ వేదికపై ఈ యువ సంచలనం తన ప్రతిభను చాటుకునే ఛాన్స్ దక్కుతుంది. ఈ మార్పులపై బిసిసిఐ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com